# మద్యం షాపుల తొలగింపుకోసం ఆందోళన

**విజయనగరం, 12–9–16 :**

విజయనగరంలో శాంతినగరం ప్రాంతం పూర్తిగా రెక్కల కష్టం మీద ఆధారపడి రెక్కాడితేగాని డొక్కాడని శ్రమజీవులతో నిండి ఉంటుంది. గతంలో ఇక్కడ విజయ్‌బార్ ఉండేది. దానితోపాటు గత యేడాది సూర్య వైన్స్ అనే మద్యంషాపుకు అధికారులు అనుమతిచ్చారు. ఈ రెండు మద్యం విక్రయకేంద్రాలు పోటీలుపడి ప్రజలచేత తాగించడంతో సాయంత్రం సమయంలో ఈ ప్రాంతం ముఖ్యంగా రోడ్ వెంబడి మహిళలు నడవలేనిస్థితి ఏర్పడింది. రోడ్‌మీదే లారీలు వంటి భారీ వాహనాలు, బైక్‌లు పార్క్‌చేసి నడిరోడ్డుపైనే మద్యం సేవించేవారి ఆగడాలతో రాత్రి 11, 12 గం॥ వరకు పరిస్థితి దారుణంగా ఉంటూ వస్తుంది. మరలా ఉదయం 5 గంటలకే మద్యంషాపులు తెరిచి అమ్ముతున్న పరిస్థితితో, ఈ చుట్టుప్రక్కల వారికి, ఈ రోడ్డుగుండా వెళ్ళేవారికి ప్రతిరోజూ నరకప్రాయమైంది. ఈ రెండు మద్యం కేంద్రాలు ఒకటి అధికార టిడిపిదైతే మరొకటి వైఎస్ఆర్ పార్టీ నాయకుడిది. ఎక్సైజ్ అధికారుల అండతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తూవచ్చారు.

మద్యంషాపు వద్ద ట్రాక్టరు క్రింద పడి ఇటీవల ఒక వృద్ధురాలు మరణించింది. 30–8–16న మరో వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. దీనితో ఈ ప్రాంత ప్రజల సహనం నశించి, మహిళలు తమంతట తామే స్వచ్ఛందంగా కదిలి రెండు మద్యంషాపులను దగ్గర వుండి మూయించివేశారు. రహదారి దిగ్బంధం చేశారు. అధికారుల తీరును నిరసించారు. పోలీసులను మహిళలు నిలదీశారు.

ఈ మహిళల ఆందోళనకి సిపిఐ, ఏఐఎఫ్‌టియు(న్యూ), ఎన్‌వైఎస్ మద్దతుగా నిల్చాయి. 'మద్య వ్యతిరేక పోరాటకమిటీ' ఏర్పడింది. ఈ రెండు మద్యంషాపుల వద్ద మహిళల నిరవధిక ధర్నా ప్రారంభ మయ్యింది. కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఆఫీసు వరకు ప్రదర్శన, ధర్నా జరిగాయి. ఆగస్టు 10, 11 తేదీలలో ఏపి బాలసంఘం సభ్యులు గౌతమి, సునీత తదితరులు మద్యం వ్యతిరేకపోరాట శిబిరంలో పాటలు పాడి వినిపించారు. జనంపాటలు మహిళలను బాగా ఆకట్టుకున్నాయి. 11వ తేదీన సాయంత్రం ఎన్‌వైఎస్ ఆధ్వర్యంలో మహిళలు, బాలలు ప్రదర్శన జరిపి శిబిరంలో ధర్నా నిర్వహించారు.

12–8–2016న గ్రీవెన్స్ డే రోజున వినతిపత్రం ఇవ్వడానికి పోరాటకమిటీ కలెక్టరు ఆఫీసుకు వెళ్ళి రాష్ట్రమంత్రి, జిల్లాకు చెందిన కిమిడి మృణాళినికి వినతిపత్రం ఇవ్వగా ఆమె నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించడంతో మంత్రిని నిలదీస్తూ మద్యం వ్యాపారుల కొమ్ముకాస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోరాటకమిటీ సభ్యులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోరాటకమిటీ సభ్యులను పోలీసు అధికారులు ఈడ్చుకు పోయారు. ఈ అలజడితో అధికార యంత్రాంగం కదిలింది. ఎస్‌పి ఆధ్వర్యంలో సమావేశం జరిపి 20 రోజుల్లో మద్యంషాపులు ఆ ప్రాంతం నుంచి తరలించాలని అప్పటిదాకా ఆ మద్యంషాపులను కూడా తెరవవద్దని ఎక్సైజ్ అధికారులతో చర్చించి ఆదేశించారు.

మద్యంషాపులు తరలించడానికి 20 రోజులు గడువు ఇచ్చినందున తాత్కాలికంగా ఆందోళన విరమించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మహిళాసంఘం బాయి రమణమ్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. అశోక్, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు బి. శంకరరావు, మున్సిపల్ కౌన్సిలర్ కె. వరలక్ష్మి, ఎన్‌వైఎస్ జిల్లాఅధ్యక్షులు ఎం.అప్పలరాజు, బాలసంఘం ప్రతినిధి కె. గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ooooo